క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టాస్ వేస్తున్న రామానుజన్ గణిత క్లబ్ వ్యవస్థాపకుడు రజనీకాంత్

సాలూరు: నవోదయ వెలమపేట యువత ఆధ్వర్యంలో బొన్నాడ శ్రీనివాసరావు, గుల్లిపల్లి గణేష్, నక్కెల్ల ప్రకాష్‌ల జ్ఞాపకార్థం పట్టణంలో నిర్వహిస్తున్న డివిజనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. సుమారు 52 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌ను రామానుజన్ గణిత క్లబ్ వ్యవస్థాపకుడు రంభ రజనీకాంత్ టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, సీఐ శ్రీనివాసరావు, నాయకులు భవిరెడ్డి ప్రసాద్, కర్రి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువుల వితరణ



వస్తువులు అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: మండల కేంద్రంలోని గరికిపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి విజయనగరం జిల్లా సాలూరు గ్రామానికి చెందిన చల్లా దంతేశ్వరరావు పలకలు, ఫ్యాన్‌లు, గ్లాసులు, గిన్నెలు, ఆట వస్తువులు అందజేశారు. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న అతను తన స్నేహితుడు రవి కుమార్ ద్వారా వీటిని అందించారు. ఎస్ఆర్‌ఐ దంతేశ్వరరావుకు అంగన్‌వాడీ సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రణస్థలం సీడీపీవో ఝాన్సీబాయ్, సూపర్‌వైజర్ మంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త రూపసుధ పాల్గొన్నారు.

పెళ్లి కుమార్తెకు ఆర్థిక సాయం



పెళ్లికుమార్తెకు నగదు, చీర అందిస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

మక్కువ: మండలంలోని వెంకట భైరిపురం గ్రామానికి చెందిన పెళ్లి కుమార్తె ఏనుగుల శిరీషకు ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు సమకూర్చిన పెళ్లిసారెను సర్పంచ్ వెంకటరత్నం శుక్రవారం అందించారు. పది వేల రూపాలయ నగదు, చీర, జాకెట్ అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామంలో ఏ ఇంటిలో పెళ్లి జరిగినా పెళ్లికుమార్తెకు సాయం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెస్సార్ ఫౌండేషన్ సభ్యులు, పెళ్లికుమార్తె తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాంబన్నవలసలో ఫ్రైడే.. డ్రైడే

గరుగుబిల్లి: మండలంలోని మరుపెంట పంచాయతీ సాంబన్నవలసలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీని నిర్వహించి ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ఉండేలా మంచినీటి బావులు, బోరుబావులు సమీపంలో మురుగునీరు నిల్వ వుండకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మస్తర్లు సక్రమంగా వేయాలి



సిరికొండ వద్ద ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ఉపాధి పనులు జరిగేచోట వేతనదారులకు సక్రమంగా మస్తర్లు వేయాలని ఎంపీడీఓ దొంక త్రినాథులు అన్నారు. పాలకొండ మండలంలోని సిరికొండ, వెలగవాడ, గోపాలపురం తదితర గ్రామాల్లో ఎంపీడీఓ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. వేతనదారుల హాజరు, అందుబాట్లో ఉన్న మౌలిక సదుపాయాపై ఆరా తీశారు. వేసవి నేపథ్యంలో వేతనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ సిబ్బంది పనులు జరిగేచోట కచ్చితంగా ఉండాలన్నారు. రోజువారీ నివేదికలు, పనుల తాజా పురోగతి తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌కు బదిలీ

సీతంపేట: స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీగిరికి విజయనగరం బదిలీ అయ్యింది. ఈ స్థానంలో విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గోపాల్‌కృష్ణ బదిలీపై రానున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ప్రజల మద్దతు



తాళ్లబురిడిలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ఉందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే జోగారావు గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా? రైతు భరోసా వచ్చిందా? పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా? అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.

ఓర్వలేకపోతున్న ప్రతిపక్షాలు

ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ నాయకులు బి.కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదాల నివారణకు సహకరించాలి



రోడ్డుకు అడ్డంగా మొరాయించిన వాహనం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర, గ్రామీణ రహదారిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనచోదకులు, పాదచారులు సహకరించాలని ఏఎస్సై శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రరహదారిలో హనుమాన్ జంక్షన్ వద్ద తారస్ వాహనం ఇంజిన్ మొరాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన వాహనాన్ని క్రేన్ సహాయంతో బయటకు నెట్టి వాహనాల రాకపోకలకు అడ్డు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రరహదారిలో వాహనాల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరిగిందని అందునా ఎక్కువ వాహనాలు ఎక్కువ బరువుతరలించే తారస్ వాహనాల రాకపోకలు జరుగుతున్నాయని తెలియజేశారు. మండలంలోని మరిపివలస నుంచి లచ్చయ్యపేట వరకూ 17 కిలోమీటర్ల దూరం రాష్ట్ర రహదారి ఉందన్నారు. రోడ్డుకు ఇరువైపులా లచ్చయ్యపేట, అంటిపేట, కాశీపేట, చినభోగిలి, సీతానగరం, అప్పయ్యపేట, జోగింపేట, గుచ్చిమి, చిన్నారాయుడుపేట, మరిపివలస గ్రామాలున్నాయని, ప్రజలు నిరంతరం తిరుగాడే సమయంలో వాహనాల రాకపోకలను గమనించాలని, లేదా పోలీసువారు ఏర్పాటు చేసిన హెచ్చరికలను పాటించాలని కోరారు. వాహన చోదకులు పాదచారుల రాకపోకలను గమనించి, జనసందోహం ఉన్న ప్రాంతాల్లో వేగాన్ని నియంత్రించి ప్రయాణం చేయాలని సూచించారు.

రహదారి పనుల నాణ్యత పరిశీలన



పాలకొండ - రాజాం రోడ్డు పనుల్లో నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పాలకొండ - రాజాం రహదారిలో స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి రేగిడి మండలం సంకిలి వరకు దాదాపు 6 కిలోమీటర్ల మేర చేపడుతున్న రహదారి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నట్లు ఆర్అండ్‌బీ జేఈ జంపాన జగన్మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం పనుల నాణ్యతను అధికారి తన సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ రహదారిలో ఏర్పడ్డ గోతులు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.3.75కోట్ల మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ వ్యయంతో పనులు చేపట్టామని తెలిపారు. నీటి ప్రవాహం కారణంగా తరుచూ ఛిద్రమవుతున్న చోట సిమెంట్ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో రహదారిని ప్రజలకు అందుబాట్లోకి తీసుకువస్తామన్నారు.

మలేరియాకు చెక్ పెడదాం



కురుపాం : నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహంలో స్ప్రేయింగ్ నిర్వహిస్తున్న నీలకంఠాపురం పీహెచ్‌సీ సిబ్బంది

కురుపాం: మలేరియా నివారణకు ప్రతీ ఒక్కరూ తమ ఇంట్లో స్ప్రేయింగ్ చేయించుకోవాలని నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అమర సింహారెడ్డి అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, మహేంద్రపురం గిరిజన గ్రామాల్లో ఏసీఎం ఐదు శాతం స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని మలేరియ సబ్ యూనిట్ అధికారి మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు, వసతిగృహ సంక్షేమ అధికారులు చిలకమ్మ, మల్లేశ్వరరావు, సూపర్‌వైజర్ గౌడు శ్రీహరిరావు, ఏఎన్ఎం సుజాత, జానకి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి

గుమ్మలక్ష్మీపురం: ప్రతీ ఒక్కరూ దోమల నివారణపై దృష్టి సారించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రదీప్, పావని అన్నారు. మండలంలో రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఈ నెల 30వ తేదీ వరకు అవగాహన ర్యాలీని గ్రామాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ తొలగింపు నిర్ణయంపై నిరసన



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వున్న త్రినాథస్వామి ఆలయాన్ని తొలగించే ఆలోచనను ఆర్టీసీ అధికారులు విరమించుకోవాలని గుమ్మలక్ష్మీపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో సుధాకర్ కాంప్లెక్స్ ఆవరణలోని ఆలయం వద్ద గల చిత్రపటాలను శుక్రవారం తొలగించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గతంలో గ్రామ పెద్దలు, దాతలు ఆర్టీసీ కాంప్లెక్స్ కోసం స్థలాన్ని ఇచ్చారని, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందే ఆ స్థలంలో ఆలయం ఉందన్నారు. ఆలయం తొలగించాలని ప్రయత్నించి హిందువుల మనోభావాలను దెబ్బతీయవద్దని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

మినీ గోకులాల వివరాలు సేకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గ్రామాల్లోని మినీ గోకులాల వివరాలు సేకరించండి అని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక మండల సమావేశ భవనంలో ఉపాధి, పశుసంవర్ధక శాఖ సాంకేతిక సహాయకులు, పశుసంవర్ధక సహాయకులతో శుక్రవారం సమావేశమైన ఆయన గతంలో టీడీపీ హయాంలో 2028–19 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో రైతులు నిర్మించిన మినీ గోకులాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటోందని, బిల్లుల చెల్లింపుల కోసం మినీ గోకులాల వివరాలను సచివాలయ పశుసంవర్ధక సహాయకులు, ఉపాధి సాంకేతిక సహాయకులు సంయుక్తంగా వివరాలు సేకరించి, అందజేయాలని తెలిపారు. ఏపీఓ జగదీశ్వరరావు మాట్లాడుతూ మండలానికి 117 మినీ గోకులాలను గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేయగా, వాటిలో 48 మినీ గోకులాలకు ఉపాధి నిధులు మంజూరు చేసేందుకు ఎఫ్‌టీఓలు తయారు చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన 69 మినీ గోకులాల పరిస్థితి ఏవిధంగా ఉందో వాస్తవ సమాచారం కార్యాలయానికి సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్రపతిని కలవనున్న గిరిజనులు

సీతంపేట: ట్రైకార్ సంస్థ ఆధ్వర్యంలో ఐటీడీఏ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పది మంది గిరిజనులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవడానికి త్వరలో న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నట్టు ఐటీడీఏ వర్గాల ద్వారా తెలిసింది. సీతంపేట, మందస, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి తదితర మండలాలకు చెందిన ఒక్కో గ్రామం నుంచి ఒక్కొక్కరు వెళ్లనున్నట్టు సమాచారం. రైతులు, చిత్రకారులు, వేతనదారులు, డిగ్రీ విద్యార్థులు, బీటెక్, డిప్లమా, వీడీవీకేల నుంచి సభ్యులు వెళ్లనున్నారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అలాగే వివిధ సమస్యలపై రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు సమాచారం.

ఏజెన్సీలో 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు

గుమ్మలక్ష్మీపురం: రానున్న ఖరీఫ్ కోసం రైతులకు కావాల్సిన వరి, వేరుశనగ విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేపట్టనున్నట్లు... ఇందుకు తగిన ఏర్పాట్లు జిల్లా వ్యవ సాయ శాఖ అధికారులు చేశారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు. స్థానిక విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. గతంలో అదును లో విత్తనాలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడేవారని, ఇప్పుడైతే విత్తనం కోసం ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న సంకల్పంతో సీఎం జగనన్న ఆదేశాల మేరకు సీజన్ కంటే ముందుగా విత్తనాల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులకు అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీపైన, కంటింజెన్సీ కింద ఇచ్చే విత్తనాలను 80 శాతం సబ్సిడీపైన ఇవ్వనున్నట్లు వివరించారు. ఆర్బీకేల్లో రైతుల నమో దుతో పాటు, విత్తనాల పంపిణీ చేయనున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్నారావు సూచించారు.

ఘనంగా మలేరియా మాసోత్సవాలు

సీతంపేట: మలేరియా నిర్మూలనా మాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి అన్నారు. స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వైద్య సిబ్బందితో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లకార్డులు, బ్యానర్లు, స్లోగన్స్‌తో ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రతీ ఇంట్లో రక్త నమూనాలు సేకరించాలన్నారు. దోమలు పెరగకుండా శానిటైజేషన్ కమిటీలతో దోమలను నివారించాలన్నారు. గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంలో కాలువల్లో పూడికతీత చేపట్టాలన్నారు. దోమతెరలు అందరూ వాడేలా అవగాహన కల్పించాలన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, డీఎల్‌డీఓ గోపాలకృష్ణ, ఎంపీడీఓ సత్యం, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

సీతంపేట: ఆటో ఢీకొన్న సంఘటనలో రాణిపేటకు చెందిన ఎ.షన్ముఖరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... కొత్తూరు నుంచి సీతంపేట వస్తున్న ఆటో ఎదురుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న షన్ముఖరావును శుక్రవారం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కొత్తూరు సీహెచ్‌సీలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం జెమ్స్‌కు తరలించినట్టు ఎస్ఐ ఎ.నీలకంఠరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

12లోగా విధుల్లో చేరాలి

బొబ్బిలి: విద్యాశాఖలో ఇటీవల బదిలీలైన వారంతా వారి వారి స్థానాల్లో ఈ నెల 12వ తేదీలోగా విధుల్లో చేరాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కాలేజీలో 1998, 2008, 2018 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణను శుక్రవారం పరిశీలించిన ఆయన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పాఠశాలల పునఃప్రారంభం నాటికి మనబడి నాడు–నేడు పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ఎస్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి..

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఎస్ఎస్ఏ డీఈఈ ఎ.మురళీమోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన పాఠశాలలకు మంజూరైన మనబడి నాడు–నేడు రెండో విడత పనులను సెలవుల్లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, ఎంఈఓ బి.శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి వినతి



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు సమస్యలు వివరిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

సాలూరు: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ టీచర్స్‌ను కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్చాలని కోరుతూ గురుకుల అవుట్‌సోర్సింగ్ టీచర్స్ యూనియన్ నాయకులు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. మంత్రి స్వగృహంలో శుక్రవారం కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా తాము విధులు నిర్వహిస్తున్నా.. తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి చెప్పారు.

వేతనదారులు జాగ్రత్తలు పాటించాలి



కొత్తవలసలో చెరువుపనులను పరిశీలిస్తున్న ఏపీఓ భాను

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్‌కార్డులున్న వేతనదారులందరికీ పనులు కల్పిస్తున్నామని ఏపీఓ భాను తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం కొత్తవలస, బళ్లకృష్ణాపురం గ్రామాల చెరువుల్లో వేతనదారులు చేస్తున్న పనులను, మస్తరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని వేతనదారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. వేతనదారులు తలకు తెల్లని తువ్వాలు, కాళ్లకు చెప్పులు ధరించాలని సూచించారు. చల్లని నీడ నీడ నిచ్చే చెట్లకింద సేదతీర్చుకోవాలని, పనిదగ్గరకు తీసుకెళ్తున్న మజ్జిగ, నీరు చల్లని ప్రదేశాలో మూతవేసి ఉంచాలని, దాహం వేసే సమయంలో తాగాలని చెప్పారు. వేతనదారులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

రెండవరోజూ పింఛన్ కానుకల పంపిణీ



బుడ్డిపేటలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్



అప్పయ్యపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.సూర్యనారాయణ



పింఛన్ అందిస్తున్న వలంటీర్

సీతానగరం: జగనన్న పింఛన్ కానుకల పంపిణీలో భాగంగా మండలంలో రెండవ రోజు ఉదయాన్నే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, వృత్తిదారుల ఇళ్లకు గ్రామవలంటీర్ల ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు వెళ్లి నగదు అందజేశారు. ఈ మేరకు గురువారం వేలిముద్రలు పడని వారిని ఐరిస్ విధానం ద్వారా గుర్తించి పింఛన్లు అందజేశారు. అప్పయ్యపేట, బుడ్డిపేట గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో పింఛన్ల పంపిణీ జరిగింది.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

బలిజిపేట: రాజాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు ఆర్. లక్ష్మణమ్మ దగ్గరికి మండలంలోని అంపావల్లి గ్రామానికి చెందిన వలంటీరు శెట్టి గణేష్ వెళ్లి శుక్రవారం పింఛన్ అందించాడు. ఈ సందర్భంగా వలంటీర్ సేవలను గ్రామస్తులు అభినందించారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక భరోసా



స్నేహితుని కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ ధ్రువపత్రాలు అందజేస్తున్న హెల్పింగ్ హేండ్స్ గ్రూప్ సభ్యులు

పాలకొండ రూరల్: తమతో పాటు చదువుకుని ఇటీవల మృతి చెందిన కొచ్చర్ల వేణు(43) కుటుంబ సభ్యులను సహచర మిత్రులు, పాలకొండకు చెందిన 1994 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వపు విద్యార్థులు శుక్రవారం వారి స్వగృహంలో కలిశారు. మిత్రుని మృతికి గల కారణాలు తెలుసుకుని తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తమ స్నేహితునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గుర్తించారు. వారికి తమవంతు సాయం అందించాలని నిర్ణయించారు. ఇది వరకే వారు ఏర్పాటు చేసుకున్న హెల్పింగ్ హేండ్స్ గ్రూప్ ద్వారా రూ.లక్షా 27వేలను సేకరించి మరణించిన స్నేహితుని పిల్లల పేరిట డిపాజిట్ చేశారు. సదరు ధ్రువపత్రాలను స్నేహితుని కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పూర్వపు స్నేహితులు మండపాక శ్రీధర్, డి.రాంప్రసాద్, జోగి రాజేష్ తదితరులున్నారు. సహకరించిన తోటి మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

భూ యజమానులు అందుబాటులో ఉండాలి



సమగ్ర సర్వేలో అధికారులకు వివరాలు అందిస్తున్న భూ యజమానులు, రైతులు

పాలకొండ రూరల్:

పట్టణ పరిధిలో జరుగుతున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమానికి భూ యజమానులు అందుబాట్లో ఉండాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ బి.బుచ్చయ్య అన్నారు. పట్టణ శివారు ప్రాంతమైన రాజుపేట కూడలి నుంచి అన్నవరం గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 170 నుంచి 200 మధ్య రీ సర్వే చేపట్టారు. దాదాపు 90 ఎకరాల వివరాలను సంబంధిత భూ యజమానులు, రైతుల సమక్షంలో నమోదు చేశారు. శనివారం రెండు ప్రత్యేక సర్వే బృందాలు ఇదే సర్వే నంబర్లకు సంబంధించిన మిగులు భూముల్లో సర్వే చేపడతారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మొబైల్ డీటీ పి.సన్యాసిరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్ఓ బలివాడ సాయి శ్రీనివాస్ తదితరులున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పార్వతీపురం / సాలూరు

9010204441, 9951602891

Office mail : vzmadvt@gmail.com